సాక్షి
వికారాబాద్
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



అదుపుతప్పిన స్కూల్ బస్సు
అతివేగం కారణంగా ఓ స్కూల్ బస్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. 8లో ▸



క్రేన్ బీభత్సం
క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తోపాటు రెండు షాపులు ధ్వంసమయ్యాయి. 8లో ▸



పత్తాలేని ఫసల్ బీమా!
విపత్తుల కారణంగా పంటలు నష్టపోతున్న రైతన్నలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. 9లో ▸

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

- 39మందిని ఎంపిక చేసిన విద్యాశాఖ
- కలెక్టర్ ఆమోదం తర్వాత నేడు తుది జాబితా
- మరి కొందరికి చోటు దక్కే అవకాశం

బషీరాబాద్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2024 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా సిద్ధమైంది. ఇందులో 39మందికి చోటు లభించింది. కలెక్టర్ ఆమోదం తర్వాత అధికారికంగా విడుదల చేస్తామని విద్యాశాఖ అధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు. జాబితాలో మరికొందరి పేర్లు చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తమ ఉపాధ్యాయులకు రేపు(గురువారం) వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యేలు అవార్డులు అందజేయనున్నారు.

జాబితాలో..
గంగుల రవీందర్‌రెడ్డి (జెడ్పీహెచ్ఎస్ చౌదర్‌పల్లి), కే రాంచంద్రయ్య (జెడ్పీహెచ్ఎస్, చెన్గోముల్), కృష్ణకుమార్ (ఎంపీయూపీఎస్, సిరిగిరిపేట), కేతావత్ తవుర్యా (జెడ్పీహెచ్ఎస్, నంబర్ – 1 పరిగి), డీ హన్మంత్‌రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, చెన్గోముల్), జీ విద్యావతి(జెడ్పీహెచ్ఎస్, చెంగోల్) బీ కరుణాకర్ (జెడ్పీహెచ్ఎస్, హకీంపేట్), సీ ఉమేష్ (జెడ్పీహెచ్ఎస్ రాంపూర్, కోట్‌పల్లి), ఎం మంజుల (జెడ్పీహెచ్ఎస్ బాలికల, కుల్కచర్ల), కే సంపత్‌కుమార్ (జెడ్పీహెచ్ఎస్, కొంశెట్టిపల్లి), కసిగరి సంగీత (జెడ్పీహెచ్ఎస్, మంబాపూర్), బీ శ్రీనివాస్ (జెడ్పీహెచ్ఎస్, మిట్టకోడూర్), ఆర్ హన్మంతు (జెడ్పీహెచ్ఎస్, హకీంపేట్), సీ బుచ్చిరెడ్డి (జెడ్పీహెచ్ఎస్, కోట్‌పల్లి), బీ బిచ్చియ్య (జెడ్పీహెచ్ఎస్ నం.1, పరిగి), బీమ్యానాయక్ (జెడ్పీహెచ్ఎస్, కిష్టాపూర్), ఫాతిమాబేగం (జెడ్పీహెచ్ఎస్, కోట్‌పల్లి), పీ విజయలక్ష్మి (జెడ్పీహెచ్ఎస్ బాలికల, పెద్దేముల్), కే విజయ్ ఆనంద్ (జెడ్పీహెచ్ఎస్, ఇందూరు) జే సుధాకర్ (జెడ్పీహెచ్ఎస్ బాలికల, కొడంగల్), బీ కొండయ్య (టీజీఎంఎస్, బంట్వారం), టీ మాధవి(టీజీఎంఎస్, పూడూరు), మొగులయ్య (ఎంపీపీఎస్, అగ్గనూరు), వీ సుజాత (ఎంపీపీఎస్, మన్నెగూడ), బీ కృష్ణయ్య (ఎంపీయూపీఎస్, గుండాల్), కే వాణి(ఎంపీయూపీఎస్, మైలారం), బీ ఆంజనేయులు(ఎంపీపీఎస్, నాగసాన్‌పల్లి), విస్లావత్ పాండ్య(ఎంపీపీఎస్, సాల్వీడ్), వీ దేవులా (ఎంపీపీఎస్, హన్మానాయక్(టి), కే రమేష్ (ఎంపీపీఎస్, సిరిపుర), కే ప్రభాకర్‌రెడ్డి (ఎంపీపీఎస్, సుల్తాన్‌పూర్), నసీం ఉన్నీసా(ఎంపీపీఎస్, సర్పన్‌పల్లి ఉర్దూ.మీ.), బీ రాధిక(ఎంపీయూపీఎస్, కోటబాస్పల్లి), ఎం నాగరాణి, (ఎంపీపీఎస్, పుల్‌మద్ది), శేరీ వీరప్ప (ఎంపీపీఎస్, మోమిన్‌ఖుర్దు), డీ రవి (ఎంపీపీఎస్, కొత్లాపూర్), ఎం రాఘవేందర్‌రెడ్డి, (ఎంపీపీఎస్, మైల్వార్), ఎం మురహరి (ఎంపీపీఎస్ అగ్గనూర్), ఏ కృష్ణవేణి,(కేజీబీవీ యాలాల) ఎంపికయ్యారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ చంద్రప్రియ

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- దోమ కాటుతోనే విషజ్వరాలు
- సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కొడంగల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఫోన్ ద్వారా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దోమ కాటుతోనే విషజ్వరాలు వస్తున్నాయని తెలిపారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తక్షణమే కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి రావాలన్నారు. 24 గంటల పాటు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. దగ్గు, జ్వరం, కడుపు నొప్పి, జలుబు ఇతర లక్షణాలు ఉంటే తమను సంప్రదించాలన్నారు. బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్త కణాలు తగ్గకుండా చూసుకోవాలని అన్నారు. వైద్య పరీక్షలు చేయించుకొని తగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఫోన్ ఇన్ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ జయదీప్‌రెడ్డి, అనస్తీషియా డాక్టర్ సాకేత్, ప్రభుత్వ డాక్టర్లు మైమూనా, పూజ, శ్రావణి, శివ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎక్స్‌రే తీసే యంత్రం ఉందా ?
– శివయ్య, కొడంగల్

డాక్టర్: ఎక్స్‌రే సదుపాయం ఉంది. ఓపీ టైమ్‌లో మాత్రమే ఎక్స్‌రే తీస్తారు.

ప్రమాదాలకు గురైన వారిని కొడంగల్ ఆస్పత్రికి తీసుకొస్తే మెరుగైన చికిత్స కోసం తాండూరు, హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– రాజు, కొడంగల్

డాక్టర్: కొడంగల్ ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆస్పత్రి స్థాయిని బట్టి వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే హైదరాబాద్‌కు పంపిస్తున్నాం. కొడంగల్ ఆస్పత్రిలో న్యూరో సర్జన్ లేకపోవడం వల్లే సమస్య వస్తోంది.

ఆస్పత్రికి వచ్చే రోగులను మందుల కోసం బయటకు పంపిస్తున్నారు. పేదలు మందులు కొనలేక అవస్థలు పడుతున్నారు.
– రమేష్, అన్నారం

డాక్టర్: మందుల కొరత లేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన మందులు ఆస్పత్రిలో లేకపోతే బయట కొనుగోలు చేస్తున్నారు.

ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందడం లేదు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.
– రాములు, రావులపల్లి

డాక్టర్: ప్రస్తుతం కొడంగల్ ఆస్పత్రి స్థాయి 50 పడకలుగా ఉంది. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే టీచింగ్ ఆస్పత్రి వస్తుంది. అప్పుడు అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారు. ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించండి
– పోశం మోహన్, కొడంగల్

డాక్టర్: దోమలు కుట్టకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటించాలి. నీటి నిల్వ ఉండకూడదు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

వారం రోజులుగా జలుబు ఉంది. తగ్గడం లేదు. ఎలాంటి వైద్యం తీసుకోవాలి?
– రాజు, హస్నాబాద్

డాక్టర్: ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోండి. ఏమైనా సమస్యలు ఉంటే ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స అందిస్తాం.మీరు ఇప్పటి వరకు వాడిన మందుల రసీదులు తీసుకొని రావాలి.

సాక్షి ఫోన్ ఇన్

ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి విష సర్పాలు బయటకు వస్తున్నాయి. అవి కాటేస్తే చనిపోయే అవకాశం ఉంది. ఆస్పత్రిలో పాము కాటుకు మందులు ఉన్నాయా?
– వెంకట్‌రెడ్డి, పెద్ద నందిగామ

డాక్టర్: కొడంగల్ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ ఒకరిద్దరు పాముకాటు బాధితులు వైద్యం కోసం వస్తున్నారు. చికిత్స చేసి పంపిస్తున్నాం.

ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పులు చేయడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.
– జయశ్రీ, కొడంగల్

డాక్టర్: నార్మల్ కాన్పులు చేస్తున్నాం. గర్భిణులు వచ్చి నార్మల్ కాన్పులు చేయించుకొని వెళ్తున్నారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు డాక్టర్ లేకపోవడం వల్ల సిజేరియన్లు చేయడం లేదు. అనస్తీషియా డాక్టరు అందుబాటులో ఉన్నారు. కాన్పులకు సంబంధించిన డాక్టర్లు వచ్చిన తర్వాత అవసరమైన వారికి సిజేరియన్ ఆపరేషన్లు చేస్తాం.

రోగుల పాలిట వైద్యులే దేవుళ్లు. అందుబాటులో ఉండి సేవలు అందిస్తే ప్రాణాలు దక్కుతాయి. ఆ దిశగా సేవలందించాలి.
– పార్వత్‌రెడ్డి, నందారం

డాక్టర్: కొడంగల్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఊపిరితిత్తుల డాక్టర్, చిన్న పిల్లల డాక్టర్, అనస్తీషియా వైద్యుడు, జనరల్ ఫిజిషియన్, మహిళా వైద్యులు అందుబాటులో ఉన్నారు. డ్యూటీ డాక్టర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. పూర్తి స్థాయిలో మందులు ఉన్నాయి. ప్రజలకు సత్వర, మెరుగైన వైద్య సేవలందించేందుకు అందరం కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

డెంగీ పేరుతో దోపిడీ చేస్తే చర్యలు



ఓపీ సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

నవాబుపేట: జిల్లాలోని కొంత మంది ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు డెంగీ పేరుతో తప్పుడు పరీక్షలు చేస్తూ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు, భవనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో నకిలీ డెంగీ రిపోర్టులు చూపి అమాయక ప్రజల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. అలా చేసే వారి సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 7780478817కు కాల్ చేసి చెప్పాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీకి ఉచిత పరీక్షలు చేస్తారని వివరించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. నవాబుపేట పీహెచ్‌సీ భవనం వర్షాలకు ఉరుస్తోందని, పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం నిర్మించడమా.. మరమ్మతులు చేయడమా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రాజెక్టు ఆఫీసర్ పవిత్ర, మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు వేగవంతం చేయండి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న హరిచందన, ప్రతీక్‌జైన్

రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన

అనంతగిరి: జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి మూడు నెలల్లో పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో అవకతవకలకు ఆస్కారం ఇవ్వరాదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా కాలి బాటల నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు వికారాబాద్‌లో రూ.96 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. సమీక్షలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ వసంత నాయక్, ఇన్‌చార్జ్ ఈఈ శ్రీధర్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాస్లబాదు కల్వర్టు పరిశీలనకు వచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, అధికారుల బృందం

వర్ష బాధితులను ఆదుకుంటాం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: వర్షాలకు నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కాస్లబాదు, మల్లారెడ్డిగూడెం, వెల్‌చాల్ గ్రామాల్లోని నందివాగు పరీవాహక పొలాలను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలో ఐదు ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. బాధితులకు తక్షణ సాయంగా కలెక్టర్ కోటా నుంచి రూ.3,500, తన కోటా నుంచి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బాధితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కాస్లబాదు, మాల్లారెడ్డిగూడెం గ్రామాల్లో నందివాగుపై కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అన్నదాతలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మహేందర్‌రెడ్డి, సురేందర్, శుభాష్ గౌడ్, మాణయ్య, ఏ రాజ్, ఏజాస్, సిరాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దాం.. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే వినియోగిద్దామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం పర్యావరణ విద్యా విభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మట్టి గణపతులనే పూజిద్దాం అనే వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దాం అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సమన్వయంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఎస్ సురేష్, జనరల్ మేనేజర్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడాలి

విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం యంగ్ ఓరేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంత్ర, శిక్షా లోకం, భారత్ దేకో, అలోకిత్ సంస్థల ఆధ్వర్యంలో మండల రిసోర్స్ పర్సన్లు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మాతృభాషతోపాటు ఆంగ్లంలో కూడా మాట్లాడగలిగేలా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకోసం వారంలో రెండు రోజులు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. బోధించే సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు పూర్తి పట్టు ఉన్నప్పుడే విద్యార్థులు చదువులో రాణిస్తారని చెప్పారు. చిత్ర, సంభాషణ తోపాటు వివిధ అంశాలతో పిల్లల్లో ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్‌లో మాట్లాడే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. యంగ్ ఓరేటర్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపు ఉపాధ్యాయులకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, నిర్వాహకులు పవిత్ర, అభిజిత్ ఆయా సంస్థల సభ్యులు నిక్షిత్, మొహవిన్, యాన్సీ, ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి



మల్లేశం

అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, విద్యార్థినులు (ఫ్రెష్ మరియు రెన్యూవల్) 2024 – 25 విద్యా సంవత్సరానికి గానూ పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి ఎస్ మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు ఇందుకు సహకరించాలని కోరారు. విద్యార్థుల బ్యాంక్ ఖాతా నంబర్లు, ఇతర వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 2022 – 23, 2023 – 24 విద్యా సంవత్సరాల పోస్ట్‌మెట్రిక్ హార్డ్ కాపీలను తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

తహసీల్దార్ల బదిలీ

అనంతగిరి: ప్రభుత్వం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తహసీల్దార్ల బదిలీల్లో మల్టీ జోన్ -2లో ఇద్దరు తహసీల్దార్లు వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. రంగారెడ్డి జిల్లా నుంచి వెంకటేష్ ప్రసాద్, నారాయణపేట జిల్లా నుంచి డి.గాయత్రి వచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న బి.సుగుణ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

అనంతగిరి: అర్హులైన రైతులందరికి రుణమాఫీ పథకం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ రైతు వేదికలో రేషన్‌కార్డు లేని వారి వివరాలను వ్యవసాయ పోర్టల్‌లో నమోదు చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, గ్రామాలకు వ్యవసాయాధికారులు వస్తారని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ స్వరూప, ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఐద్వా నేతలు

పరిగి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో మహిళా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు సంబంధించినవేనని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం పరిగి ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వెంకటమ్మ, కమిటీ సభ్యులుగా అనసూయ, దేవమ్మ, గౌసియా బేగంను ఎన్నుకున్నారు.

నృత్యంలో సత్తాచాటిన బాలకేంద్రం చిన్నారులు



అనంతగిరి: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాశీ వేదికగా ఐసీఎండీఏ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నత్య ప్రదర్శనలో వికారాబాద్ బాలకేంద్రానికి చెందిన చిన్నారులు పాల్గొని చక్కటి ప్రదర్శన ఇచ్చినట్లు బాలకేంద్రం నృత్య శిక్షకురాలు టీపీ అనురాధ మంగళవారం తెలిపారు. చిన్నారులు శివతాండవంపై చక్కటి ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. నిర్వాహకులు జ్ఞాపికలు అందజేసి సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు శ్రేయ, అనన్య, రష్మిక, పరిణకమాంబ, సౌమ్య, సృజన, వేదశ్రీ, సంహిత, జాహ్నవి, సృజన, భవిత, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అభిషేక పూజలో డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయార్చకులు అభిషేకం చేసి ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆనంద్ ప్రారంభించారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులున్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించండి

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి



మల్‌రెడ్డిపల్లి చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

తాండూరు టౌన్: భారీ వర్షాల కారణంగా తాండూరు మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి చెరువును కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం చెరువు అలుగు పారుతోందని, ఎలాంటి కోతకు గురి కాలేదన్నారు. వినాయక నిమజ్జనం మల్‌రెడ్డిపల్లి చెరువులో కూడా చేయనుండటంతో అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలు మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని కోరారు. చిన్న సైజులో ఉండే మట్టి గణేశులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కమిషనర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పాముకాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

నవాబుపేట: పాము కాటుకు గురైన ఓ ఎద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన నారెగూడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొనింటి మల్లేశం ఎద్దును సోమవారం సాయంత్రం పశువుల పాకలో ఉంచాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా విగతజీవిగా పడింది. విషయాన్ని పశువైద్య సిబ్బందికి సమాచారం వచ్చి పరిశీలించారు. పాము కాటు కారణంగానే ఎద్దు మృతి చెందిందని పశువైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను యాలాల పోలీసులు గుర్తించి తిరిగి బాధితులకు అప్పగించారు. మండలంలోని ఎన్కేపల్లికి చెందిన వేణు, గోరేపల్లికి చెందిన మల్లేశ్ ఇటీవల తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయమై యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్న పోలీసులు మంగళవారం బాధితులకు అందజేశారు.

భారీ వర్షం.. అన్నదాతకు నష్టం

భారీ వర్షాలు అన్నదాతను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. పరిహారం అందక.. పంట చేతికి రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట బీమా పథకాలపై స్పష్టత ఇవ్వక పోవడంతో ప్రతీ ఏట నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతింటున్న పంటలు
- పట్టించుకోని ప్రభుత్వం
- పరిహారం అందక రైతుల గగ్గోలు

పరిగి: ఎడతెరపిలేని వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. మూడేళ్లుగా అతివృష్టి కారణంగా పంటలు పాడై రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం వారికి మొండి చేయి చూపుతోంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంట బీమాలపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో మొక్కజొన్న, వరి, కంది, పత్తి తదితర పంటలు సాగు చేశారు. అకాల వర్షాలు కురవడంతో రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

ప్రచారానికే బీమా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పంటకు బీమా వర్తిస్తుంది.. ఎలా బీమా చేయించాలనే విషయం అవగాహన కల్పించడంలో విఫలమవుతోంది. పంట నష్టం జరిగితే ఫొటో పంపిస్తే పరిహారం అందిస్తామని ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు.. ఆపత్కాలంలో అన్నదాతలను పట్టించుకోవడం లేదు. బీమా పథకాలు అమలు చేయక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అధికారులు మాత్రం సర్వే చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రాపోల్‌లో నీటమునిగిన పత్తి పంట

నీట మునిగిన పంటలు

మూడు రోజులు భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మెట్ట పొలాల్లో సాగు చేసిన పంటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలో పరిగి, పూడూర్, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలు మొత్తం వ్యవసాయాధారిత ప్రాంతాలే. ప్రతీ గ్రామంలో వందల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. నియోకవర్గంలో దాదాపుగా 1,10,000 ఎకరాలకు పైగా మొక్కజొన్న, పత్తి, కంది, వరి సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. ఎడతెరపి లేని వర్షాలతో పొలాల్లో నీరు చేరిపంటలు దెబ్బతిన్నాయి. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చస్తున్నారు.

పరిహారం అందించండి



రెండేళ్లుగా వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతున్నాం. గతేడి పంట పూర్తిగా పాడైంది. అధికారులు నష్ట పరిహారం అంచానా వేశారు. ఇప్పటికీ పరిహారం మాత్రం ఇవ్వ లేదు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఆదుకోవాలి. – నాగవర్ధన్, రైతు, రాపోల్

అధికారులు స్పందించాలి



వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. గత ప్రభుత్వం సైతం తమను పట్టించుకోలేదు. – రహీంపటేల్, రైతు, సయ్యద్ మల్కాపూర్

ఇంకా ఆదేశాలు రాలేదు



పంట రుణమాఫీపై గ్రామాల్లో క్రాస్ చెకింగ్ నిర్వహిస్తున్నాం. దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశానుసారం పంట నష్టం అంచనా వేసి నివేదిక అందజేస్తాం. ప్రభుతం నుంచి బీమా సౌకర్యం లేదు. – డీఎస్ లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

గుండెపోటుతో కర్ణాటకవాసి మృతి

పరిగి: కూలీపనికి వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా చిట్‌గుప్ప గ్రామానికి చెందిన శివరాజ్(49) నగరంలో పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణ కేంద్రంలోని ఎర్రగడ్డపల్లి గ్రామానికి పనికి వచ్చి వెళ్తున్నాడు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఎర్రగడ్డపల్లి శివారులో ఛాతిలో నొప్పి రావడంతో బైక్ ఆపి రోడ్డు పక్కగా పడుకున్నాడు. స్థానికులు గమనించి 108కు ఫోన్ చేసి సమాచారం అందించి పరిగి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పిన బైక్

మహిళకు గాయాలు

కద్లాల్: బైక్ అదుపుతప్పి ఓ మహిళ గాయపడింది. ఈ ఘటన మండల పరిధిలోని మక్తమాదారం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పార్వతమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై కొత్తపేట్‌కు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వెనుకనుంచి లారీ వేగంగా వస్తుండడంతో బైక్‌ను పక్క కు తీసుకునే క్రమంలో అదుపుతప్పింది. దీంతో పార్వతమ్మ కిందపడి గాయాల పాలైంది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్దాం

జిల్లా ఎమ్మెల్యేలు, మేయర్‌లు, మున్సిపల్ చైర్మన్ల నిర్ణయం

శంషాబాద్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉన్న సమస్యలపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మేయర్‌లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు శంషాబాద్ పట్టణంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ మేరకు నిర్ణయాలు వెల్లడించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వీధి దీపాల నిర్వహణ నుంచి ఈఈసీఎల్ సంస్థను పూర్తిగా తప్పించాలన్నారు. కేవలం దీపాలను బిగించడం తప్ప వాటి మరమ్మతులు, ఇతర నిర్వహణను సదరు సంస్థ ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హెచ్ఎండీఏ ఇస్తున్న అనుమతులకు స్థానిక సంస్థల ఎన్ఓసీలను తప్పనిసరి చేయాలన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు అన్ని నల్లాలను క్రమబద్ధీకరించడమే కాకుండా జీహెచ్ఎంసీ పరిధిలో ఇస్తున్న మాదిరిగా ఉచిత నీటిని అందించాలని డిమాండ్ చేశారు. స్టాంప్ డ్యూటీల్లో యాభైశాతం స్థానిక సంస్థలకే అందించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో ఉద్యోగులను సంఖ్యను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించాల్సి ఉందన్నారు. పై డిమాండ్లన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడానికి నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, వీర్లపల్లి శంకర్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు

యాచకురాలి మృతి

బొంరాస్‌పేట: ఆకలితో అలమటిస్తూ తోలు బొమ్మలను ఆడించే ఓ యువతి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేగడిమైలారంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దామరగిద్ద మండలం నింగడపల్లికి చెందిన భవాని(22) తన అన్న కృష్ణతో తోలుబొమ్మల కులవృత్తితోపాటు రికార్డింగ్ డ్యాన్సులు చేస్తూ సంచార జీవనం సాగించేవారు. కాగా ఐదేళ్లుగా రేగడిమైలారంలోని ఊరు బయట ఉన్న పశువైద్యశాలలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి భవాని భిక్షాటన చేస్తూ గ్రామంలో తిరిగింది. సోమవారం సైతం గ్రామంలో భిక్షాటన చేసిన ఆమె గ్రామంలోని జాతీయ రహదారిపై వర్షానికి తడిసి మృతి చెందింది. ఆమె ఆకలితో అలమటించి చనిపోయినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. వెంటనే తన అన్న కృష్ణకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శవ పంచనామా చేయగా, గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు చేశారు.



భవాని మృతదేహం

అనారోగ్యంతో మహిళ..

ఇదే గ్రామంలో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మరో దళిత నిరుపేద మహిళా ముసులగళ్ల పద్మ(27) చనిపోయింది. పద్మకు భర్త రమేశ్, కూతురు, కొడుకు ఉన్నారు. ఒకేరోజు గ్రామంలో ఇద్దరు నిరుపేద మహిళలు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి

తుక్కుగూడ: వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటన తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. లక్ష్మీగార్డెన్ సమీపంలో ఉండే ఇద్దరు చిన్నారులు స్థానికంగా ఉండే కిరాణ దుకాణానికి వెళ్తుండగా వారిపై ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు.

క్రేన్ బీభత్సం

- డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రెండు షాపులు ధ్వంసం
- గాయాలపాలైన యువకుడు



నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

ఇబ్రహీంపట్నం: క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటుగా రెండు షాపులు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ, బాధితులు తెలిపిన ప్రకారం.. రాయపోల్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వైపు ప్రయాణిస్తున్న ఓ క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపు తప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. పక్కనే ఉన్న ఓ కిరాణ కొట్టులో సామగ్రి, బార్బర్ షాపుల రేకులు దెబ్బతిన్నాయి. దుకాణంలో పనిచేసే రజాక్ అనే యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలిన వెంటనే విద్యుత్ ట్రిప్ అవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం కావడంతో బార్బర్ షాపులు మూసి ఉన్నాయి. బీహార్‌కు చెందిన డ్రైవర్ జమీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



ధ్వంసమైన కిరాణకొట్టు

రూ.5లక్షల నష్టం

క్రేన్ ఢీకొట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఆయిల్ పూర్తిగా లీక్ అయింది. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటుగా విద్యుత్ ఆన్‌ఆఫ్ స్విచ్ బాక్సులు, వైర్లు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లింది. పాత బస్టాండ్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణ చర్యలు చేపట్టాం. – శ్రీనివాస్‌రావు, విద్యుత్ ఏఈ

పెళ్లి కాలేదని.. మనస్తాపం చెంది

యువకుడి బలవన్మరణం



విక్రంచారి మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సాజిద్ తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామానికి చెందిన గోవర్ధనాచారి, పుష్పమ్మ దంపతుల చిన్న కుమారుడు విక్రంచారి(28) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తనకు ఇంకా పెళ్లి కావడంలేదని మనస్తాపంతో బాధ పడుతుండేవాడు. రోజు మాదిరిగానే పని వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ శివారులోని ఓ చెట్టుకు విక్రంచారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే అక్కడికి వెళ్లే వరకే మృతి చెందాడు. విగతజీవిగా ఉన్న తమ కొడుకును చూసి బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడి తల్లి పుష్పమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడిలో విగ్రహం మాయం

మణికొండ: చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయం అయ్యిందని, పక్కనే నిర్మాణం చేస్తున్న సంస్థ వారే తీసి ఉంటారని నార్సింగి వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ముప్పి చెరువు కట్ట పక్కన ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని తొలగించాలని పక్కనే నిర్మాణం చేపట్టిన ఓ రియల్ ఎస్టేట్ గ్రూపు యాజమాన్యం కోరిందని నార్సింగి వాసులు అన్నారు. అయితే తాము అంగీకరించక పోవటంతో సోమవారం సాయంత్రం అందులోని విగ్రహాన్నితొలగించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు కింద ముంపుకు గురయ్యే ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టడం కాకుండా అడ్డుగా ఉందని ఏకంగా ఆలయాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారని, వారిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే వారిపై అధికారులు చర్యలు తీసుకుని దేవాలయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నార్సింగి గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సీనియర్ నాయకుడు గుడ్‌బై



నాగార్జున రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

ధారూరు: అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు రాజీనామా చేశాడు. దీంతో పార్టీ వర్గాలు ఒక్కసారిగా విస్మయం వ్యక్తం చేశాయి. ఆయన తన రాజీనామా లేఖను నేరుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పంపించారు. వివరాలు.. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.నాగార్జున రెడ్డి పార్టీ కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని అలకబూనారు. తనకు జరిగిన అవమానాన్ని జీర్ణించుకోలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 1న వికారాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నికకు పార్టీ నాయకులను ఆహ్వానించి తనను మరిచారన్నారు. రెండేళ్ల క్రితం పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నికకు సైతం సమాచారం ఇవ్వలేదని ప్రశ్నిస్తే విజయభాస్కర్ రెడ్డి తనకు వ్యతిరేకంగా గ్రామంలో మరో వర్గాన్ని ప్రోత్సహించారన్నారు. ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరగా.. విజయభాస్కర్‌రెడ్డి తనకు పదవి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తనను దూరం పెడుతూ అవమానిస్తున్నారని అన్నారు. ఈ విషయాలు స్పీకర్ పట్టించుకోకపోవడంతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నానన్నారు. తాను ఏ పార్టీలో చేరబోనన్నారు.

భార్యను హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరణ

- భర్తకి పదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా
- తీర్పు వెలువరించిన కోర్టు

శంకర్‌పల్లి: అదనపు కట్నం కోసం గర్భిణిగా ఉన్న తన భార్యను హత్య చేసి.. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించాడో కీచక భర్త. పదకొండేళ్ల తర్వాత చివరికి కోర్టు తీర్పుతో పదేళ్ల జైలు శిక్షతో కటకటాలపాలయ్యాడు. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన కూతురైన స్వప్నని శంకర్‌పల్లి మండలం సంకేపల్లికి చెందిన మానేష్ గౌడ్(35)కి ఇచ్చి 2012లో వివాహం చేశాడు. మానేష్ పెళ్లి అయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భార్యని వేధించాడు. ఈ క్రమంలో మూడు నెలల గర్భిణి అయిన స్వప్న పుట్టింటికి వెళ్లింది. 2013 మార్చి 22న తిరిగి వచ్చింది. మానేష్ భార్యతో అదనపు కట్నం కోసం గొడవపడి.. ఆవేశంలో ఆమెని కొట్టాడు. ఆ సమయంలో స్వప్న చేయికి గాయమైంది. అనంతరం ఆమెకి ఊపిరి ఆడకుండా చేసి, హత్య చేశాడు. తర్వాత ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. కుటుంబ సభ్యులు, బంధువులకు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఇచ్చాడు. అయితే అల్లుడి ప్రవర్తనపై మామ ఈశ్వరయ్య అనుమానం కల్గింది. దీంతో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు మానేష్‌గౌడ్ ఇంట్లో పగిలిన గాజులు, ఫ్యాన్ ఎత్తు చాలా ఎక్కువగా ఉండడం, పోస్టుమార్టం రిపోర్టులో చేయి డిస్‌లోకేట్ కావడం వంటి విషయాలు వెలుగులోకి వచ్చాయి. భార్యని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులు నిర్ధారించి కోర్టులో సమర్పించారు. విచారించిన ఎల్బీనగర్ జిల్లా అదనపు న్యాయమూర్తి జయలక్ష్మి నిందితుడు మానేష్‌గౌడ్‌కి పదేళ్ల జైలుతో పాటు, రూ.5 లక్షల జరిమానా విధించారు.

బాలాపూర్ పోలీసుల నాకాబందీ



వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహిన్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి తనిఖీలు చేపట్టారు. అనుమానితుల నేర చరిత్రను పరిశీలించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను, సరైన నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, చోరీ చేసిన బైక్‌లపై తిరుగుతున్న వారిని అదుపులోకి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో నేరాల సంఖ్య పెరుగుతున్నందున ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పు నిఘా కొనసాగిస్తూ.. ఆకస్మిక సోదాలు చేపడుతున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అతివేగంతో అదుపుతప్పిన స్కూల్ బస్సు

చేవెళ్ల: అతివేగం కారణంగా ఓ స్కూల్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ ఘటన చనువెళ్లి అనుబంధ గ్రామం ఇక్కారెడ్డిగూడ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని సిల్వర్ డేల్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సులో రోజు మాదిరిగానే పామెన, చనువెళ్లి, ఇక్కారెడ్డి గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకుని వెళ్తున్నారు. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సు రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. బస్సు పూర్తిగా ఒక వైపు ఒరగడంతో చిన్నారులు ఒకరిపై ఒకరు పడి స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను కిటికీలోంచి కిందకు దించారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒకరికి వాంతులు అవ్వడంతో తల్లిదండ్రులు వైద్యుల సూచన మేరకు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని.. డ్రైవర్‌లు ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కళాశాల కరస్పాండెంట్ మోనాచారి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బస్సు డ్రైవర్ కుక్క అడ్డురావటంతో తప్పించే క్రమంలో జరిగిందని స్పీడ్‌లో లేనని చెప్పాడు. ఠాణాలోని బస్సును పరిశీలించిన ఆర్టీఏ అధికారులు ఫిట్‌నెస్ లేని కారణంగా సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.



బస్సు కిటికీలోంచి విద్యార్థులను దించుతున్న తల్లిదండ్రులు

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వైనం
- స్వల్పగాయాలతో బయటపడిన చిన్నారులు
- ఫిట్‌నెస్‌లేని బస్సును సీజ్ చేసిన అధికారులు